మరణంలో జీవితం

'రాజేశ్వరీ!' అప్పుడే ఇంట్లోకి వచ్చి జుట్టు ముడి విడదీసుకుంటున్న రాజేశ్వరి ఆ పిలుపు విని చటుక్కున తల పైకెత్తింది. తలుపు దగ్గిర ఇందాక చూసిన ఎవరో బెంగాలిబాబు అని తను పొరపాటుగా అనుకున్న రాంమోహన్ రావు నిల్చునివున్నాడు నిందాపూర్వకమైన నవ్వుతో

మొదట రాజేశ్వరికి ఆశ్చర్యంతో మాట రాలేదు ఆఫీసు నుంచి బస్‌దిగి వస్తూంటే వీధిలో వెనక ఎవరో నడుస్తున్నట్టనిపించి వెనక్కి తిరిగి చూసింది మసకచీకటిలో మొహం సరిగ్గా కనిపించలేదు కానీ ఆ నడక పరిచయమైనదాని లాగే అనిపించింది ధోవతీ పైనలాల్చీ, బుజంచుట్టూ శాలువ ఎవరో బెంగాలి అనుకుంది

'ఏం రాజేశ్వరీ పలకటం కూడాలేదు వీడెవరు గౌరవించటానికి అనుకుంటున్నావా?' రాజేశ్వరి తేరుకుంది వేషం మారినా, మనిషి మాట, స్వభావం మారలేదు వెంటనే ఏదో ఒకటి అనాలి చెయ్యాలి 'కూచోండి' తన గొంతు తనకే అసహజంగా వినిపించింది, 'ఆ ఆలోచన, పరధ్యానం పొడిమాటలు నువ్వేమీ మారలేదు ' అంటూ కూచున్నాడు ఆ మాటకొస్తే ఎవరు మారారు? నాలో మార్పు ఆశించి వచ్చాడా? ఇప్పుడీయన ఎందుకొచ్చినట్టు?

'నాకు మాట్లాడడం సరిగ్గా చేతకాదు. ఆ సంగతి నీకు తెలుసు అదే నాకు చేతనయి నీకునచ్చే అబద్ధాలూ, కల్పనలూ సహజంగా, అందంగా చెప్పగలిగివుంటే నువ్విలా ఒంటరిగా బతకాల్సిన అవసరం వుండేదికాదు ' మాటమాటకీ దెప్పు అంతా ఎదుటివారిదే తప్పైనట్టు నింద. అనవసరపు నిందలు అబద్ధాలకంటే అసహ్యకరమైనవి 'అబద్ధాలని భరించవచ్చు కాని నిందలని సహించటం చాలా కష్టం' అప్రయత్నంగా పైకనేసింది

ఆర్. ఇందిర

'అంటే తప్పంతా నాదే నంటావ్ నువ్వేమీ చెయ్యకుండానే, నేను నిన్ను అనవసరంగా అన్నాననేగా?'

'నేనేమీ అనలేదు ఈ విషయం గురించి మీరేమంటారో వినే ఓర్పు, సహనం నాకు లేవు ఎందుకొచ్చారో త్వరగా చెప్తే ' అప్పుడే ఎనిమిది గంటలు పని చేసి వచ్చిందేమో పైగా అనుకోని ఈ సంఘటనతో ఆమెకి తల దిమ్ముగా అయింది ఫ్లాస్కులోంచి కాఫీ గ్లాసుల్లో పోసి అతని ముందుకు జరిపింది కాఫీ మెల్లిగా తాగుతున్న ఆ అమ్మాయిని ఆశ్చర్యంగా చూశాడు 'నువ్వింత ప్రశాంతంగా ఏదో మామూలు విషయం జరిగినట్టు నిర్లక్ష్యంగా వుంటావని నేననుకోలేదు నే నెవరో పూర్తిగా మర్చిపోయి నట్టున్నావ్'

"దాదాపు మర్చిపోతున్న సమయంలో మీరొచ్చి మళ్ళీ జ్ఞాపకం చేశారు "

"ఏం నా జ్ఞాపకాలు అంత వేధించాయా?"

"ఎవరి జ్ఞాపకాలు ఎవరిని వేధించాయో కానీ, వేదన మాత్రం జన్మకి సరిపడా మిగిలింది "

'ఇంక నీకు ఏ దిగులూ వద్దు ఒంటరిగా వుండి అలసిపోయావ్ ఇంటికెళ్దాం రా'

'ఇంటికి? ఎవరింటికి?'

'నీ ఇంటికి అదే మన ఇంటికి'

"మన ఇల్లు అలాంటి మాటలు వాడకండి మీరొచ్చింది అందుకే ఐతే మాత్రం మీ శ్రమ వృధా అయినందుకు విచారిస్తున్నాను నాకు ఏ ఇల్లూ లేదు— వఎరూ లేరు"

'నువ్వలా అనుకున్నా నేననుకోటం లేదు మొదట్నించీ మనది 'వన్ సైడ్ ఎఫేరేగా' నీతో మరీ మరీ విసిగిపోయి ఆఖరి రోజుల్లో రెండుమూడుసార్లు నేను మొరటుగా ప్రవర్తించిన మాట నిజమే కానీ అలా ప్రవర్తించటానికి కారణం ఎవరు? ఐనా నీ ప్రవర్తనంతా క్షమించేసి నేను చేసినవి మాత్రమే తల్చుకుని పశ్చాత్తాపపడి వచ్చాను' అతగాడు ముఖాన్ని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ అన్నాడు

'అంత క్షమించరాని నన్ను మళ్ళీ ఎందుకు పిలుస్తున్నారు?' అతని అహానికి దెబ్బ తగలకుండా సున్నితంగా తిరస్కరించాలని రాజేశ్వరి ప్రయత్నం మీ క్షమాపణ నన్ను గిల్టీగా తయారయ్యేట్టు చేస్తుంది. నా పొగరుకు గిల్టీఫీలింగ్ తోడైతే అది నన్నూ, మిమ్మల్నీ ఇద్దరినీ సుఖపడనివ్వదు'

'నిన్ను మార్చాలనేగా నా ప్రయత్నమంతా మొదట్నించీ అదేగా నీకు నా గురించి సరిపడనిది! సరైన పెంపకం లేక అలా తయారయ్యావు నువ్వు చేసినవన్నీ తెలీక చేశావని అనుకుంటున్నాను అన్నీ మర్చిపోయి మళ్ళీ కొత్తజీవితం మొదలుపెడుతున్నానుగా లే లేచి సర్దుకో ఇంటద్దె ఇవ్వాలా?" దగ్గరగా వచ్చాడు

"ఆగండి నేనెక్కడికీ రాను ఎవ్వరితో కలిసి బతకను నన్నిలా ప్రశాంతంగా వుండనివ్వండి మీ మార్పులూ.— మీ కోపాలూ, మీ అనురాగం—మీ తిరస్కారం, మీ లాలింపులూ — మీ చీదరింపులూ అన్నీ పది జన్మలకి సరిపడా

అనుభవించాను నన్ను విసిగించక దయ చేసి వెళ్ళండి మీకు నమస్కారం చేస్తాను "

"ఇక్కడ ఎవరైనా దొరికారేమో నాకంటే గొప్పవాళ్ళు. అందుకే రానం టున్నావ్" ఆఖరు అస్త్రాన్ని ఉపయో గించాడు

"దొరకటం? కావాలనుకుంటే నాకదేం కష్టంగాదు ఇలా షిప్టుడ్యూటీలు చేస్తూ కష్టపడాల్సిన అవసరం కూడా లేదు కానీ మీకు ఒకందుకు చాలా కృతజ్ఞురాలిని మీ దయవల్ల మొగవాళ్ళంటే భయం, సెక్సు అంటే అసహ్యం కలిగాయి—"

"ఇవన్నీ నాదగ్గిర కబుర్లు!" కోపాన్నీ అవమానాన్ని అణచుకుంటూ అన్నాడు.

'ఏవైనా అనుకోండి దేనికీ నేను ఎక్స్ ప్లైనేషన్ ఇవ్వను అవసరం లేదుకూడా ఎలా వున్నానో, ఎలా ప్రవర్తిస్తున్నానో కానీ స్వతంత్రంగా బ్రతుకుతున్నాను ఎప్పుడు ఆ ఇంటి నుంచి బైటికి వచ్చే శానో, అప్పుడే మనిద్దరి మధ్య అప్పటి వరకూ వూగులాడుతున్న సున్నితమైన బంధం తెగిపోయింది ఇంతదూరం నా అడ్రెస్ కనుక్కుని అభిమానంతో కాదు ఆశతో వచ్చారు కాబట్టి చెప్తున్నాను మీకు కావల్సిన సుఖాల్ని కొనుక్కోండి అంతేకాని పెళ్ళిచేసుకోవటంకాని, ఎవరితో నైనా కలిసి జీవించటం కాని చెయ్యకండి ఒకరితో కలిసి జీవించటం మీకు పడదు దయచేసి ఇక వెళ్ళండి అలిసిపోయాను నాకు విశ్రాంతి కావాలి" నమస్కారం చేసింది రాజేశ్వరి ఇక మాట్లాడవల్సిం దేమీ లేదన్నట్లు ఆమె మొహంలో పట్టు దల చూసి ఒకడుగు వెనక్కి వేశాడు "ఎప్పుడో నువ్వే వచ్చి కాళ్ళావేళ్ళా పడే తావు కానీ అప్పటికి నిన్ను స్వీకరిండ స్థితిలో వుంటానని అనుకోకు—ఆవేశ పడక ఆలోచించుకో మళ్ళీ వచ్చి కల్సు కుంటాను " అంటూ వెళ్ళిపోయాడు

పోతున్న అతన్ని వెనకనించి చూస్తున్న రాజేశ్వరికి జాలికలిగింది. అతనికి ఇచ్చిన కాఫీ అలాగేవుంది. మనిషి చాలా తగ్గిపోయాడు పోనీ వెళ్ళే అమ్మో! కలిసి జీవించటానికి మనిషి మీద మనిషికి జాలిమాత్రం చాలదు అంతకు మించిన ప్రేమతో, సహనంతో కూడిన బంధం కావాలి అదే మనిషి తనని రాత్రికి రాత్రి ఇంట్లోంచి బైటికి నెట్టి, కుక్కని తరిమినట్టు తరిమేశాడు అది తల్చుకోగానే రాజేశ్వరికి ఒంట్లో రక్తమంతా మరుగుతున్నట్టయింది.

* * *

రాజేశ్వరి అమ్మానాన్న రైలుప్రమా దంలో పోయారు ఆ పిల్లని మేనత్త వర సైన ఒకావిడ పెంచింది ఆవిడకి ఆ పల్లెటూళ్ళో చిన్న హోటలుండేది—ఆవిడ కెవరూలేరు రాజేశ్వరినే సొంతబిడ్డలా చూసుకునేది టెన్త్‌క్లాస్‌వరకూ చదివిం చింది ఆవిడ మితభాషి ఏదైనా మాట్లా డితే చాలా నెమ్మదిగా మృదువుగా మాట్లా డేది రాజేశ్వరికి ఆవిడ దగ్గరనుంచి, ఆలోచించి చాలా తక్కువగా మాట్లాడటం వచ్చింది కానీ స్వతహాగా ఆ అమ్మాయి మాటపడే మనిషికాదు తనెవ్వరినీ ఏమీ అనదు. ఎవరైనా అనవసరంగా అంటే మాత్రం సహించేదికాదు కచ్చితంగా

జవాబు చెప్పేది ఏదైనా ఆ అమ్మాయికి నెమ్మదిగా చెప్పాల్సిందే తాసిస్తే ఒక్క మాట కూడా వినదు

రాంమోహనరావ్ టూర్ మీద ఆ వూరికి వచ్చినప్పుడు రాజేశ్వరీవాళ్ళ హోటల్‌కు వచ్చేవాడు అతనికి అన్నమాత్రం వున్నాడు అదీ ఎక్కడో దూరంలో వుద్యోగం చేసుకుంటూ స్థిరపడి—ఆవిడకి అభ్యంతరం లేకుంటే రాజేశ్వరిని పెళ్ళి చేసుకుంటానని ఆవిడతో అన్నాడు రా మోహన్‌రావ్. రాజేశ్వరి అత్తయ్య ఆలోచించకుండా ఒప్పుకుంది. ఆవిడ



దగ్గిర డబ్బులేదు. మనిషి సాయంలేదు వరుణ్ని తేవటానికి అతనేమో మంచి వుద్యోగం చేస్తున్నాడు. ఆవూరికి వచ్చి నప్పుడు బాగా పరిచయమైనాడు మంచి వాడు గొప్ప వంశంవాడు ఇంతకంటే ఆవిడ మాత్రం ఎవర్నితేగలదు? ఆవిడ రాజేశ్వరి అభిప్రాయం అడిగింది ఆ అమ్మాయికి అప్పుడు పెళ్ళిగురించి ఆలో చించే వయసులేదు, వ్యవధిలేదు. చాయిస్ లేదు. పెళ్ళిచాలా నిరాడంబరంగా జరి గింది ఆవూళ్ళోవాళ్ళు దిక్కులేని రాజే శ్వరికి పట్టిన అదృష్టాన్ని పెళ్ళప్పుడు రాంమోహన్‌రావ్ ముందే పొగిడారు వెంటనే తనతో హైదరాబాదు తీసికెళ్లాడు ఆ అమ్మాయిని.

హైదరాబాదుకువచ్చిన కొత్తల్లోరోజూ అతను ఆఫీసునుంచి వచ్చాక ఎక్కడికైనా బయటికి వెళ్ళేవాళ్ళు రాంమోహన్‌రావ్‌ది చాలా విచిత్రమైన మనస్తత్వం ఇంట్లో ఎంత నెమ్మదిగా, అతిప్రేమగా వుండే వాడో గడపదాటిం తర్వాత అంత దురుసుగా, విసురుగా ప్రవర్తించేవాడు ఎప్పుడూ తను పుట్టిన పల్లెటూరుతప్ప వేరే ఏం చూడని ఆ అమ్మాయికి ఒకేసారి హైదరాబాద్‌లాంటి సిటీకి రావటం పెద్ద అడ్వంచర్ ప్రతీది ఒకవింత వీధుల్నీ, షాపుల్నీ, రకరకాల మనుషుల్నీ, ఫాషన్లనీ కళ్ళింత చేసుకొని చూస్తూండేది ఏ భయంలేకుండా చకచకా నడుస్తూ బస్సులెక్కే ఆడపిల్లల్ని చూస్తే వాళ్ళంతా ఆకాశంనుంచి దిగొచ్చిన దేవ తల్లాగా ఆఅమ్మాయికళ్ళకి కనిపించేవాళ్లు అది అతనికి చిరాకు "మీ వూళ్ళోలాగా అందర్నీ అలా పైనించి కిందికిచూస్తే అసహ్యంగా వుంటుంది మీ హోటల్లో వున్నప్పటి అలవాట్లు మానుకో !" అంటూ ఆ అమ్మాయి అడిగినవాటికి చెప్పకపోగా పక్కపక్కనే నడుస్తూ కసిరేవాడు బస్సు ఎక్కివెనక అతను ఎక్కాడోలేదో చూచేది వరసగానించున్న వాళ్ళలో ఎక్కడో అతను కనిపించేవాడు. "బస్సులో ఎక్కి వెనక్కి వెనక్కి చూస్తా వెందుకు అందరూనిన్నే చూస్తున్నారు. నీలా ఒక్కరుకూడా చెయ్యటంలా చిన్న వంశం, చిన్న బుద్ధులు!" అదీ బస్‌దిగి ఏదో వుత్సాహంగా చెప్పబోతున్న రాజే శ్వరికి అతని రెస్‌పాన్స్ చిన్నచిన్న విషయాలకి వంశాలని గురించీ, పెంపకాల గురించీ దెప్పుతాడెందుకో ఇక ఆఅమ్మా యికి మ్యూజియంలోగానీ, పార్కులో గానీ ఎక్కడయినా చూచిన విషయం వివ రంగా తెలుసుకోవాలని ఆసక్తి అతనికి ఒకటే తొందర ఒకచోటునుంచి మరో చోటికి చూశామన్నట్టు పని ముగించుకుని శరవేగంతో పరిగెత్తటం తప్ప విషయ మేమిటో తెలుసుకోవాలన్న ఉత్సాహం లేదు ఎవరయినా చెపుతుంటే వింటూ అక్కడే నిల్చునిపోయేది పరధ్యాన్నంగా. "నేనోపక్క వెళ్ళామంటుంటే, ఎవరేం చెపుతున్నా ఒళ్ళుమరిచిపోయి నిలబడిపోతా వెందుకు? నేనంటే లెక్కలేనట్టేగా?" అంటూ అర్థాలు తీసేవాడు ఒకరోజు ఏదో పెద్దహోటల్‌కి తీసికెళ్ళాడు. ఐస్ క్రీమ్ తింటూంది చాలా బావుంది అలాంటివి వుంటాయనికూడా ఆ అమ్మా యికి తెలీదు నవ్వుతూ అతనివైపు



చూసింది "చూశావా? మీ హోటల్లో అవే విటి రాజేశ్వరీ పకోడీలని పేరుపెట్టి మీరు అమ్మేవి? అవే అమ్ముకుంటూ, అవే తింటూ వుండకుండా, రిట్జ్ హోటల్స్, ఐస్‌క్రీమ్‌లు, అదృష్టం అంటే నీదే!" అంటూ నవ్వాడు అది విట్టీగా మాట్లాడటం కాబోలు అతని దృష్టిలో కానీ రాజేశ్వరికి మనసు కష్టమేసింది నోట్లో పెట్టుకున్న ఐస్‌క్రీమ్ చేదుగా, అసహ్యంగా తోచింది ఆ పకోడీలకో వేటికోసమో తనూ ప్రతీసారి అత్తయ్య హోటల్‌కేగా వచ్చేవాడు తను అతని భార్యకాకముందు ఏం తినిందో, ఏం చేసిందో కానీ ఏదీ తిరిగి తలచుకుంటే సిగ్గుపడాల్సిన విషయమేమీలేదు అత్తయ్య దగ్గరున్నప్పుడు ఎవరూ తనని తక్కువగా చూడలేదు. కించపరచలేదు ఇప్పటివరకూ రాజేశ్వరికి గతానికి ప్రాముఖ్యంలేదు. తక్కువ లేదు చాలా సాధారణంగా గడిచిపోయింది కానీ రాంమోహన్‌రావ్ మాటిమాటికి అనే మాటలతో ఆ అమ్మాయికి ప్రస్తుతం తను గడుపుతున్న జీవితంకంటే గతంలో ఎంతో ఆనందంగా స్వేచ్ఛగా వున్నట్లు మనసులో రహస్యంగా అనిపించసాగింది

తను పదహారేళ్ళు మాత్రం అత్తయ్య దగ్గిర వుండింది ఇక ముందున్న నూరేళ్ళ జీవితం అతనితోనే కదా పంచుకోవాల్సింది అలాంటి భార్యని, అందర్నీ వదులుకొని తననే నమ్ముకొని వచ్చిన ఆడదాన్ని మగవాడు ఎందుకు చులకనగా చూస్తాడో అ అమ్మాయికి అంతుపట్టలేదు. ప్రతీచిన్న విషయానికి ఎక్కడో పల్లెటూళ్ళో అనాధగావున్న అమ్మాయిని పెళ్ళిచేసుకుని పుద్ధరించానన్నట్టు అతను అనే మాటలు, అందుకు తనకి ప్రతి నిముషం కృతజ్ఞత చూపుతుండాలన్నట్లు

అతను వ్యక్తంచేసే అభిప్రాయాలు వింటూంటే తిరిగి ఏదయినా వెంటనే అనెయ్యాలని "పెళ్ళికోసం ఎవరేడ్చారు? అతనేకదా కావాలని తనని చేసుకుంది? ఆడదానికి మగవాడి అండ ఎంత అవసరమో, మగవాడికి ఆడదాని అవసరం అంతకంటే ఎక్కువ దీనికి ఒకరికొకరు కృతజ్ఞులుగా ఎందుకుండాలి? భార్యాభర్తలమధ్య వుండాల్సింది భయం-కృతజ్ఞతేనా? స్నేహంగా ఆప్యాయంగా వుంటే చాలదూ?" పెదిమల చివరదాకా వచ్చినమాటల్ని, చిన్నప్పట్నించీఅత్తయ్య శిక్షణలో వచ్చిన ఆత్మనిగ్రహం, ఆలోచన వాటిని బైటకు రాకుండా మనసులోనే నొక్కేసేవి

అతను ఆఫీసుకెళ్ళాక ఇంట్లోకూర్చుని ఏవైనా చదువుకుంటూ వుండేది ఆఫీసుకు వెళ్లేప్పుడు ఎలా వుండేవాడో తిరిగి వచ్చేటప్పుడు అదే మూడ్‌లోవుండేవాడు. ఇంట్లో వేరేవాటాల్లోవుండే ఆడవాళ్ళంటే ఆరాధన. వాళ్ళతో మాట్లాడుతూవుంటే మంచిమంచి అలవాట్లు వస్తాయి వాళ్ళంతా పెద్దఫామిలీస్ లోనుండి వచ్చినవాళ్ళు అంటూమళ్ళీ నీతులు ఇన్‌స్ట్రక్షన్స్ మొదలు "వాళ్ళతో టైమ్‌పాస్‌కి సరదాగా మాట్లాడు" అంటే ఆసక్తి కలిగేదేమో కాని ఇలా అనేసరికి రాజేశ్వరికి చుట్టూ ఎవ్వరితో అసలు మాట్లాడకూడదనే పట్టుదల కలిగింది తనకున్న చెడ్డ అలవాట్లేమిటో? అతను వాళ్ళవంశం గురించీ తరచుగా చెప్పేమాటల సారాంశం, అతని ముత్తాతలు పెద్ద జాగీర్దారులట. ఆ జాగీర్‌లూ, వంశప్రతిష్టలూ తండ్రితరం వచ్చేముందే పోయాయి గత వైభవము లేకపోయినా, దాని చిహ్నంగా "ఫాల్స్ ప్రిస్టేజి" సంక్రమించింది ముఖ్యంగా ఆడవాళ్ళ విషయంలో అతనిలో చిత్రమైన అభిప్రాయాలు పాతుకుపోయాయ్ అతని నాన్నమ్మ నాన్నమ్మ, అత్తయ్యల అత్తయ్యలు పరదాలవెనకే వుండేవాళ్ళట పల్లకీలలోనే బైటకెళ్ళే వాళ్ళట పరదాల వెనక చేతిగాజుల చప్పుడే వాళ్ళు ఇంట్లో వున్నట్టు గుర్తు అలాంటి "అసూర్యంపశ్యల" వారసుడు "రాజా రాంమోహన రావ్‌బహద్దర్‌కి" ఆడవాళ్ళని పంజరంలో చిలకల్లాగా చూస్తేనే వంశగౌరవం నిలుస్తుంది!" అనే నీతివాక్యం పుట్టుకతోనే వంటబట్టింది అతని ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఆ పరదాలూ, పల్లకీలూ ఎక్కడ్నించి తేగలడు? అందుకని రాజేశ్వరి హద్దులు దాటిపోకుండా (అతనిపరిభాషలో) మాటలతో, చేతలతో మానసికంగా బంధించాలనే అతని తెలివితక్కువ ప్రయత్నంలో, భార్యని రోజురోజుకీ అత్మీయంగా దగ్గిర చేసుకునే బదులు, దూరం అవుతూ పోగొట్టుకుంటున్నాననే నిజం తెలుసుకోలేక పోయేవాడు

సహజంగా అందరు ఆడపిల్లల్లాగా ఆ అమ్మాయికికూడా పెళ్ళయిన రోజునుంచి భర్తంటే ఆరాధన, గౌరవం కలిగాయి. మొదట్లో, ఇంట్లో అన్ని సౌకర్యాలు చేసేవాడు కాని అతని మాటలు, వికృతమైన స్వభావం భరించలేనంతగా వుండేవి "జీవితావసరాలు" గడిచిపోతున్నాయ్ కదాని ఎలాగో ఓలాగు మనసుని సర్దుకుని వుండగలిగివుంటే రాజేశ్వరి సుఖంగా బతుకు

తున్నదనే అనుకోవచ్చు కానీ అ అమ్మాయికి అతనితో సహజీవనం, పాతజీవితాన్ని మరిపించకపోగా, ఏమీ ప్రత్యేకత లేని గతమే మాటిమాటికీ గుర్తుచేస్తూ ఒంటరిగా స్వేచ్ఛగా బతకాలనే తపనని పదేపదే కలిగించేది అసంతృప్తిని కలిగించేది పెళ్ళికాకముందు రాంమోహన రావు పరిచయస్థుడు మూడేళ్ళు గడచిన తర్వాత రాజేశ్వరికి అతను పరాయివాడు!

అతను టూర్‌నించి వచ్చేసరికి రాజేశ్వరి నేలమీద పడుకుని ఏడుస్తూంది పక్కనే కుర్చీలో ఒకతను కూచుని వంగి ఏదో అంటున్నాడు ఇంట్లోకి వచ్చిన రాంమోహనరావ్‌కి ఇది చూసి కళ్ళు తిరిగాయి "ఏమిటి? ఎవరు? ఏమైంది?" గట్టిగా అడిగాడు రాజేశ్వరి లేచి భర్తని చేతులతో చుట్టి ఏడ్చేసింది అతను గోపి రాజేశ్వరి వాళ్ళ వూరినుంచి వచ్చాడు యాత్రలకని వెళ్ళిన అత్తయ్య హరిద్వార్ దగ్గిర సముద్రంలో స్నానంచేస్తూ మునిగిపోయిందట ఆ సంగతి వాళ్ళ వూరి మున్సబుకు తెలియపరచారు గోపీ, రాజేశ్వరికి చిన్నప్పటినుంచీ తెలిసినవాడు హైదరాబాద్‌కు పనిమీద వచ్చి రాజేశ్వరికి ఈ విషయం చెప్పాడు గోపీ గడప దాటంగానే "చూశావా చీటికీ మాటికీ నాతో పోట్లాడుతావ్ ఇన్నాళ్ళు మీ అత్తయ్య అండ చూసుకునేగా అదృష్టం



కొద్దీ నీకు పెళ్ళైంది లేకుంటే ఆ మోటు మనిషి గోపీలాంటివాడికి వుండే దానివి వాడికి కుర్చీలో కూర్చోటం కూడా రాదు వాడికి కుర్చీ ఎందుకేళావ్? ఐనాఇప్పుడు నీకేం భయం లేదులే నే నున్నాను" అంటూ ఒళ్ళోకి తీసు కున్నాడు కన్నతల్లిలాటి అత్తయ్యలేదు ఆవిడ లోటు ఎవరూ తీర్చలేరు ఎప్పు డైనా ఆవిడదగ్గరికి పోవచ్చనే ఆశకూడా పోయింది అంత దుఃఖంలోనూ హృదయ శూన్యుడైన భర్త వళ్ళోనే సేద తీర్చుకో వాల్సి వచ్చినందుకు వెక్కి వెక్కి ఏడ్చింది రాజేశ్వరి మేకపిల్లకి పులి వళ్ళో ఓదార్పు! అప్పటినుంచీ రాజేశ్వరికి అతని మీద విసుగు, అలసత్వం ఏర్పడ్డాయి అతని మాటలకి ఇన్నాళ్ళలాగా జవాబు చెప్పకుండా వుండేదికాదు బలవంతంగా తెచ్చుకున్న ఓర్పు, సహనం చెదిరి పోయేవి దాంతో ఏవో మనస్పర్ధలూ, చీకాకులూ ఇద్దరిమధ్యా యెప్పుడూ వుండేవి

ఆ రోజు పెళ్ళిరోజు పెళ్ళై మూడే ళ్ళయింది. కలతలతో, పోట్లాటలతో ఒకరితో ఒకరు మాట్లాడుకుని చాలా రోజులైంది సున్నితమైన రాజేశ్వరి అతని మౌనం తన ప్రవర్తనవల్లనేమో నని బాధపడింది కలతలన్నీ మంచు విడి పోయినట్టు విడిపోయి, అతను సంతో షంగా వుండాలనే ఆ అమ్మాయి కోరు కుంది అతనెలాటివాడైనాకానీ, తన గురించీ మాత్రం కష్టపడకూడదు అతని స్వభావం తెలిశాక తనే మాట్లాడకుండా వుంటే పోతుంది. దీనివల్ల ఎవరికి సుఖం ఇన్నిరోజులు తనని అంటూ ఒక విధమైన మానసికానందం అనుభవించే వాడేమో. తనకెలాగైనా ఆనందంలేదు అతనికి కూడా యెందుకు లేకుండా చెయ్యాలి? రాజేశ్వరి నవ్వుకుంది కలిసి ఓ కప్పుకింద బతకాలంటే అవతలివాళ్ళ స్వభావానికిఅనుగుణంగా సర్దుకోవటమైనా నేర్చుకోవాలి, లేక్క చెయ్యకుండా ముందుకు పోవటమైనా అలవాటు చేసు కోవాలి మొదటిదానికి సహనం, రెండో దానికి ఆత్మవిశ్వాసం అవసరం ఆత్మ విశ్వాసం ఎవరిమీదా ఆధారపడకుండా స్వతంత్రంగా వున్నప్పుడు వస్తుంది ఈ రెండూ చేతకాకపోతే జీవితం నరకం అవుతుంది ఆ నరకాన్నే తోటివాళ్ళకి పంచాలా? ఒద్దు తనకెంత కష్టం కలి గినా అతనికి సుఖాన్నే యిస్తుంది ఏ విధంగానైనా అతను సంతోషంగా వుండాలి భార్యగా అదే తన కర్తవ్యం

సాయంకాలం అతని కిష్టమైన వంట చేసింది ఇల్లు శుభ్రంగా సర్ది స్నానం చేసింది ఇస్త్రీ చీరె కట్టుకుని, తల్లో మల్లె పూలు పెట్టుకుంది పరుపుమీద మల్లెపూలు చల్లింది అగరుబత్తులు స్టాండులో గుచ్చి పెట్టింది

రేడియో బల్లమీద కోవా, బిస్కెట్లు ప్లేట్లో పోసి వుంచింది రాజేశ్వరికి కాస్మె టిక్స్ వాడటం అసలిష్టం వుండదు. ఐనా అతనికి కావాలి బట్టలమీద సెంట్ చల్లింది అద్దంలోంచి తనని, గదినిచూసి సిగ్గుపడింది ఇద్దరూ సరిగ్గా వున్నప్పుడు ఇలాంటివేమీ అనిపించవుకానీ, అతని కోపం తగ్గించటానికే అనిపించేసరికి



గిల్టీగా ఫీలైంది. ఏమయినాసరే యీ మూడేళ్ళ చేదు గత జీవితంలోంచి జరగనట్టు మాయమయిపోయి మళ్ళీ ఈ పెళ్ళి రోజునించీ మరోసారి తియ్యటి వర్తమానం మొదలవాలి

మంచంమీద పుస్తకం చదువుతూ కూచున్న రాజేశ్వరి తలెత్తి చూసేసరికి పదీ-పది ఆకలెప్పుడో చల్లారిపోయింది వంటింట్లోకి వెళ్ళి మంచినీళ్ళు తాగివచ్చి పడుకుంది తలుపుమీద గట్టిగా చప్పుడు వులిక్కిపడిలేచి, పరిగెత్తికెళ్ళి తలుపు తీసింది ఎదురుగా మొహం ఎర్రగా పెట్టుకుని, ఆ అమ్మాయివైపు అసహ్యంగా చూస్తూ రాంమోహనరావ్ "ఎప్పుడో పొద్దున వెళ్ళిన మనిషి రాలేదని దిగులు లేదు వచ్చాక తలుపు వెనక గంటలు, గంటలు పడిగాపులు పడి వుండాలి కాబోలు " నవ్వుతూ పలకరింపుగా చూస్తున్న రాజేశ్వరికి మొదటే నిరాశ! "లేదండీ! ఇప్పటివరకూ చూశాను తెలీకుండా నిద్దర పట్టింది "

"ఒంటిమీద భయముంటే పట్టదు అవతలి మనిషిమీద ఖాతరుంటే అసలు పడుకోవాలనిపించదు"ఇంట్లోకి విసురుగా వచ్చాడు గదిని పరీక్షగా చూసి, "ఇప్పటికి నా విలువ తెలిసిందన్నమాట" అంటూ వ్యంగ్యంగా నవ్వి "అన్నిటికీ మొగుడుమీద ఆధారపడి వుండికూడా ఆ తలపొగురు, గర్వం తగ్గించుకుని అణుకువగా వుంటే యెంత బాగుంటుంది? హోటల్లో మీ అత్తయ్య వచ్చినవాళ్ళందరికీ అన్నం పెడితే నువ్వేం చేసేదానివి? చాలా అనుభవమున్నట్టుంది ఇలాంటి విషయాల్లో !"

రాజేశ్వరి నేలచూస్తూ నించుంది.

"నా గురించి అంత ఎదురుచూశావుగా ఈరోజు నేను కావాలంటే మా వంశ గౌరవానికి తగ్గట్టు, మంచి ఫేమిలీలోంచి

వచ్చిన పిల్లలాగా నడుచుకుంటానని మా తాతయ్య ఫొటోముందు నిల్చుని నేను చెప్పినట్టు ప్రమాణం చెయ్" యాంత్రికంగా అటు వెళ్ళి నిల్చుని అతను చెపుతున్న మాటలు పెదిమలచివర పల్కుతున్న రాజేశ్వరికి సాయంత్రం తను చేసుకున్న నిర్ణయం ఎక్కువసేపు నిలవదని అర్థమయింది

ఆ అమ్మాయిని చేతులతో చుట్టేసి "నువ్విందుకోసం నేనేం చెప్పినా చేస్తావని, అవసరం! ఏం చేస్తావ్ పాపం! మగాడిమీద కోరిక, సెక్స్‌మీద వ్యామోహం !" మొహానికి తగులుతున్న అతని వూపిరి నిలువునా కాల్చేస్తున్నట్టు, అతని కౌగలి మనసునుకూడా నొక్కేస్తున్నట్టు వూపిరి తిరగలేదు రాజేశ్వరికి "కోరిక కాదు, వ్యామోహం అంతకన్నా కాదు సర్దుకుపోవాలనే పిచ్చి ప్రయత్నం, సంసారం నిలుపుకోవాలనే తాపత్రయం అభిమానాన్ని చంపుకునైనా సరే సుఖాన్ని, తృప్తినీ ఇద్దామనే ఆరాటం ఇదంతా నేనొక్కదాన్నే చెయ్యగలనని ఆశపడ్డాను గర్వపడ్డాను కానీ ఓడిపోయాను!" అంది అసహ్యంగా చూస్తూ "ఏం నటన! ఇవన్నీ నీకలవాటేగా మీ ఇంట్లో నాలాటివాళ్ళు ఎంతమంది వచ్చేవాళ్ళు రోజుకు! ఇన్నేళ్ళు నాకిది తోచనేలేదు నీ అదృష్టంవల్ల ఇలా ఒకరికి భార్యగా వున్నావేకానీ లేకుంటే " వెకిలిగా నవ్వుతున్నాడు

అతని చేతుల్లో వుండటం ఇంక అసాధ్యం అయింది రాజేశ్వరికి బలవంతంగా అతన్నుంచి విడిపించుకుని, విసురుగా నెట్టేసి దూరంగా వెళ్ళి నించుంది అతను తూలి రేడియో బల్లమీదపడి తల కొట్టుకున్నాడు ఇలా జరుగుతుందని వూహించనైనా లేదేమో అతని అహం దెబ్బతింది కళ్ళలో అసహ్యం, కోపంతో మొహం వికృతంగా తయారైంది చెంపలమీద పడ్తున్న దెబ్బలు, తనకి కాదు ఎవరికో అన్నట్టు నించుంది రాజేశ్వరి "ఎంత పొగరు! ఎంత తిరస్కారం! నీలాంటివాళ్ళు వున్నా లేకున్నా ఒకటే కొన్నాళ్ళు వీధుల్లో అడుక్కుంటేకానీ నీకు తెలిపిరాదు " ఏం అంటున్నాడో, ఏం చేస్తున్నాడో అప్పటికే కళ్ళు తిరుగుతున్న రాజేశ్వరికి అతను నెట్టాడో, తనే వచ్చేసిందో వీధిలోకి తెలీదుకానీ, వెనకాల పెద్ద చప్పుడుతో తలుపు మూసుకుపోవటం మాత్రం వినిపించింది ఎలాగైతేనేం,ఆ అమ్మాయి అనుకున్న విధంగా కాకపోయినా ఆ రోజు జీవితం కొత్త మలుపు తిరిగింది

తర్వాత ఎన్ని కష్టాలు పడి, ఎందరి సాయంతో టెలిఫోన్ ఎక్స్చేంజిట్రైనింగ్ అయిందో అవన్నీ ప్రస్తుతం రాజేశ్వరికి అనవసరం ఆ వూరికి వచ్చి ఐదేళ్ళయింది ఐదేళ్ళనించీ ప్రతి రోజు మార్పు లేకుండా సాగుతున్న రొటీన్ ఒక్కటే ఆ అమ్మాయికి తోడు పాతికేళ్ళ రాజేశ్వరి, మానసికంగా ముసలిదైపోయింది సంతోషం లేకున్నా, విచారం మాత్రం లేదు గతంలేదు, భవిష్యత్తు లేదు, ఒద్దన్నా ఒప్పుకోని వర్తమానం మాత్రం వుంది

నైట్‌డ్యూటీ చేసి వచ్చి, పొద్దు

న్నించి నిద్రపోయి అప్పుడే లేచింది రాజేశ్వరి చీకటి పడింది తలుపు తీసే సరికి ఎదురుగా, పదేళ్ళ కుర్రాడు "రాజేశ్వరి అంటే మీరేనా? ఈ చీటీ మా అమ్మ ఇచ్చింది"

"ఊ మీ అమ్మ ఎవరు బాబూ?" చీటీ తీసి చదివింది "రాజేశ్వరిగారికి, రాం మోహన్‌గావు హాస్పిటల్లో వున్నాడు అతని మాటల్నిబట్టి మీరొక్కరే అతనికి కావల్సిన వాళ్ళని తెలిసింది వీలైతే చూచి వెళ్ళండి" గౌరి! హాస్పిటల్ పేరూ, వార్డు నెంబరూ వున్నాయి

ఆర్థోపీడిక్స్ వార్డు యమ్ యస్ 1 ఎంట్రెన్స్‌లో నిల్చునేసరికి నర్సు గౌరి కనిపించింది ఆవిడని తన వీధిలో చాలా సార్లు చూచినట్టు గుర్తొచ్చింది అతను బస్ ఎక్కుతూ పడ్డాడట వెన్నెముకకి బాగా దెబ్బ తగిలింది వీధులో వాళ్ళే హాస్పిటల్లో చేర్చారు ఆపరేషన్‌చేస్తే కోలుకోవచ్చు కానీ మానసికంగా చాలా అధైర్యంగా వున్నాడుట హాస్పిటల్‌వాళ్ళు డైట్ ఇస్తున్నారు ఏమీ తినటంలేదుట రోజు రోజుకీ వీక్ అయిపోతున్నాడు. అతనికి ధైర్యమిచ్చి ఆశ కలిగిస్తే తప్పకుండా బతుకుతాడు గౌరి చెప్పింది ఈ వివరాలన్నీ!

అతను బెడ్‌మీద కళ్ళు మూసుకుని పడుకుని వున్నాడు గడ్డం పెరిగివుంది తెల్లటి అతని మొహం మరింత తెల్లగా పాలిపోయివుంది మొహం చిక్కిపోయి దవడ ఎముకలు కనిపిస్తున్నాయ్ ఫాన్ గాలికి జుట్టు చెదిరి మొహంమీద పడి వుంది రాంమోహనరావ్ చాలా అంద



మైనవాడు అందుకు మాత్రం అతను నిజంగా గర్వపడొచ్చు చిక్కిపోయి బెడ్‌మీద వున్నా ఆ అందం తగ్గలేదు కానీ ఆ అందమైన ముఖం వెనక వికృతమైన స్వభావం అదేలేకుంటే అతని కష్టసుఖాల్లో నీడలాగా వుండాల్సిన తను.

ఇలా పరాయిదానిలాగా చూడటానికి వచ్చేదా? రాజేశ్వరి మనస్సు ఆర్ద్రం అయింది పక్కన కూచుని మెల్లిగా అతని చెయ్యి పట్టుకుంది కళ్ళు తెరిచాడు మొదట ఆశ్చర్యం, అనుమానం, సంతోషం అతని కళ్ళలో కదిలాయి "వచ్చావా? ఎలా చస్తానోనని చూడటానికా?" అంటూ బలహీనంగా నవ్వాడు తను రావటం అతనికి సంతోషంగా వుంది ఏం మాట్లాడాలో తెలీలేదు రాజేశ్వరికి సొంతవాళ్ళెవరూ దగ్గిర లేకపోవటంతో హాస్పిటల్లో అతన్ని నెగ్‌లెక్ట్‌చేశారు అతని బట్టలూ, బెడ్‌మీది బట్టలూ మాసివున్నాయి వాంతి చేసుకున్నాడేమో. అదంతా బట్టలకి అంటుకునివుంది వార్డుబాయ్ సాయంతో బట్టలు మార్చేసి, బెడ్ శుభ్రంచేసింది బ్రెడ్ పాలు తెచ్చిపెట్టింది అతను ఆకలితో తింటున్నాడు

వారం రోజుల్లో అతను చిత్రంగా కోలుకున్నాడు మొహంలోకి జీవం వచ్చింది అప్టరాల్ రాజేశ్వరి తనకి భార్య చెయ్యాల్సిన బాధ్యత ఆమెకి వుంది అందుకే చేస్తోంది తనకి ఆ అమ్మాయిమీద ఇప్పటికీ, ఎప్పటికీ అధికారం వుంది వార్డులోని పేషంట్ల అటెండెంట్స్‌తో మాట్లాడటం మొదలు పెట్టాడు తన వంశంగురించీ, విశాలమైన హృదయంతో దిక్కులేని రాజేశ్వరిని చేసుకున్న గొప్పతనంతో కథ మొదలు పెట్టాడు! ఆ అమ్మాయిని చదివించేసరికి పొగురెక్కి, పోట్లాడి ఇంట్లోంచి వెళ్ళిపోయి, తప్పు తెలుసుకొని మళ్ళీ వచ్చిందని కథ ముగింపు ఈ మధ్యలో ఎన్నో తను పడ్డ కష్టాల గురించి "సెల్ఫ్‌పిటీ"తో అల్లిక! ఆ కథ వార్డులోని చాలామందిని ఆకర్షించింది!

ఈవారంలో అతను రాజేశ్వరితో మాట్లాడిన కొన్ని మచ్చుతునకలు "మీ ఆఫీసర్ ఎలాంటివాడు? నిన్ను పనికే మెచ్చుకుంటాడా? పనికొస్తావని మెచ్చుకుంటాడా? అందుకే కాబోలు మొగుడు హాస్పిటల్లోవున్నా సెలవివ్వకుండా ఎదురుగా కూచో పెట్టుకున్నాడు? ఒక కాయితం వాడి మొహాన పారేసిరాక ఇంకా వుద్యోగం అంటూ కూచున్నావ్

ఇదంతా వుద్యోగం మీది ప్రేమే? నీకు వుద్యోగం చెయాల్సిన ఖర్మేం? అన్నయ్య పోవటంతో అతని ఆస్తంతా నాకే వచ్చింది!" తనని కాదన్నట్టు కూచునేది రాజేశ్వరి

ఆఫీసులో పని హాస్పిటల్ డ్యూటీలో రాజేశ్వరి నలిగిపోయింది జ్వరం వస్తోంది, రేపే అతనికి ఆపరేషన్ ఆ సాయంత్రం అతని బెడ్ పక్కన కూచున్న రాజేశ్వరిని ఎవరో పేరుపెట్టి పిలిచారు తలెత్తి చూసేసరికి ఎదురుగా వాళ్ళ బాస్ ఆయన "కజిన్‌సన్"కి కాలు ఫ్రాక్చర్ అయితే చూడటానికి వచ్చాడట ఆయన పార్టీ ఫారిన్‌రిటర్న్‌డ్ చాలా సోషల్‌గా వుంటాడు రాంమోహన రావుని గురించి అడిగాడు తప్పనిసరిగా ఇంట్రడ్యూస్ చెయ్యవలసి వచ్చింది అతను కొంచెంసేపు మాట్లాడి "డోంట్ వర్రీ, రాజేశ్వరి ఎక్కడవుంటే అక్కడ హెల్త్ బ్యూటీ వుంటాయ్ షి యాజ్

ఎ డివైన్ డ్రాప్డ్ ఏంజెల్" అంటూ రాజేశ్వరి భుజంమీద తట్టి వెళ్ళాడు తిరిగి చూసిన రాజేశ్వరికి రాంమోహనరావు కళ్ళలో అదేచూపు, అసహ్యంతో,కసితో, అనుమానంతో నిండిన చూపు ఎనిమిదేళ్ళ క్రితం తను మరచిపోదామన్న మరిచిపోని రాత్రిని గుర్తు తెచ్చింది. ఒళ్ళు ఝల్లుమంది "మనం మళ్ళీ కలిసి బతుకుదామని ఆశపడ్డాను పిల్లలు పుడితే ఆడపిల్లల్ని మా అత్తయ్యల్లాగా, మొగపిల్లల్ని మా తాతయ్యల్లాగా గొప్పవాళ్ళని చేసి వంశ గౌరవం నిలబెడ్దామనుకున్నాను ఛ ఛ ఎంగిలాకులకోసం ఆశపడే కుక్కని సింహాసనంమీద కూచో పెడితే సరిగ్గా వుంటుందా? పుట్టుకతో వచ్చిన బుద్ధిపోతుందా? నాకు వచ్చిన డబ్బుకోసం ఆశపడి వచ్చావే కానీ రెండోసారి చిత్తుగా మోసం చేశావ్. "నీ మొహం చూస్తేనే పాపం నీవల్ల నాకు సంతోషంలేదు సుఖంలేదు" అంటూ పెద్దగా అరుస్తూ ఆవేశంగా లేచాడు "బోన్ ఎడ్జెస్ట్‌మెంట్"కి పెట్టిన పలకలూ అవీ పడిపోయాయ్! బాధతో పెద్దగా కేకేసి పడిపోయాడు అది చూసి భయంతో రాజేశ్వరికి తెలివి తప్పింది

స్టాఫ్ రూమ్‌లో కళ్ళు తెరిచిన రాజేశ్వరికి ఎదురుగా తెల్లటి శూన్యం లేచి అతనున్న వార్డులోకి వెళ్ళింది బెడ్‌ఖాళీ. ఎమర్జెన్సీ వార్డులోకి తీసికెళ్ళారని చెప్పారు వార్డు ఎక్కడో కనుక్కుని వెళ్తున్న రాజేశ్వరికి ఎదురుగా గౌరి వచ్చి చెయ్యిపట్టుకుని తీసికెళ్ళింది సన్నని కారిడార్ వీల్‌కాట్ నెట్టుకొని వస్తున్నారు గౌరితోపాటు నిలబడిపోయింది రాజేశ్వరి ప్రాణంలేని రాంమోహనరావ్ అందమైన మొహం తనకేం కాదా? పిచ్చిగా అతన్నే చూస్తున్న రాజేశ్వరికి వున్నట్టుండి అతనికళ్ళు, పెదిమలు విచ్చుకున్నట్టు కనిపించింది వాటిలో హద్దులేని అసహ్యం, ఎందుకో తెలీని కసి వాటిని అణుచుకోలేని అసహాయత, వాటన్నిటినీ తీర్చుకోటానికి మనసులేని ప్రాణం వున్న మనిషి కావాలి అదే నాకు ఆనందం అన్న ఆకాంక్ష "నాకు సుఖంలేదు, సంతోషంలేదు అన్న ఆక్రోశం

"నిజం అతను బతికిన కొద్దికాలం సుఖంగా, సంతోషంగా బతకలేదు పరిస్థితులకు సమన్వయించుకోలేని తాతల నాటి గతంలో జీవించాడు అమృతమయమైన జీవితాన్ని మరణ సదృశం చేసుకున్నాడు ప్రస్తుతం అతని వర్తమానం మరణం

"భగవాన్ మరణంలోనైనా అతనికి జీవితాన్ని ప్రసాదించు" కళ్ళు మూసుకుంది రాజేశ్వరి నిర్లిప్తంగా!